క్లుప్తంగా

ఎస్‌హెచ్‌ఓగా ఎం.అబ్బయ్య



పరకాల : ఎస్‌హెచ్‌ఓగా కాకతీయ యూనివర్సిటీ నుంచి బదిలీపై వచ్చిన ఎం.అబ్బయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిశోర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన అబ్బయ్యను ఎస్సైలు, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ



ఆత్మకూరు : సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.సంతోష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్ ఐటీసెల్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన డి.రవిరాజు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ సంతోష్ స్పష్టం చేశారు.

ఎంపీడీఓకు సన్మానం



కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమితులైన ఎంపీడీఓ గుండె బాబును గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్వపల్లి తిరుపతి, పెండ్యాల తిరుపతిరెడ్డి, బిల్లా ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కర్ణాకర్, కృష్ణ, రవి, కిరణ్, ఐలయ్య, సాంబయ్య, పాపిరెడ్డి, హేమలత, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, శివ, జయంత్‌రావు, పాల్గొన్నారు.

వేలం ద్వారా ఆదాయం



పరకాల : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 10 వాహనాలకు గురువారం వేలంపాట నిర్వహించగా రూ.లక్ష10వేల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ జగన్నాథరావు తెలిపారు. డీపీఈఓ లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.46,500 గాను రూ.1లక్ష10వేల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, రవీందర్, సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ మాజీ పాలకవర్గానికి ఘన సన్మానం



ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గానికి గ్రామస్తులు గురువారం సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ కంచ రవికుమార్, మాజీ వార్డు సభ్యులు సుజాత, రాధ, కుమార్, కృష్ణను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ స్పెషల్ ఆఫీసర్, పీఆర్ ఏఈ లత మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు.

నియామకం

కమలాపూర్ : తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా పంగిడిపల్లి గ్రామానికి చెందిన సిందె చందర్‌రావును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్దు దేవయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కమలాపూర్ : శంభునిపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన బావని మొగిలి, పిడిశెట్టి చేరాలు కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. నాయకులు తిరుపతి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీల’పై సర్వే ముమ్మరం



శాయంపేట : వివరాలు సేకరిస్తున్న ఎంపీఓ రంజిత్‌కుమార్



వేలేరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న

శాయంపేట : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అందించనున్న రూ. 500 కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు అధికారులు అర్హుల నుంచి డేటాను సేకరిస్తున్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మండల కేంద్రంలో గురువారం ఎంపీఓ రంజిత్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి గ్యాస్ కన్స్యూమర్ నంబర్, గ్యాస్ కంపెనీ ఏజెన్సీ, ఇతర వివరాలు, మొబైల్ నంబర్‌ను సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచామని అన్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 5వేల మంది గ్యాస్ వినియోగదారుల వివరాల నమోదు చేయాల్సి ఉందని, మండల కేంద్రంలో 705 మంది గ్యాస్ వినియోగదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి రత్నాకర్, అంగన్‌వాడీ టీచర్లు రత్నామాల, శ్వేత పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించాలి

వేలేరు : ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, వీఓఏలుకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహాలక్ష్మీ పథకంలో భాగంగా కొంతమంది గ్యాస్ కన్స్యూమర్ నంబర్‌లను దరఖాస్తు ఫారంలో తప్పుగా రాయడం వలన గ్యాస్ కంపనీ డేటాతో సరిపోలడం లేదని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో అంగన్‌వాడీలు, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. వీటిని సరిచేయడం వలన అర్హులైన ప్రతీఒక్కరికి పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విమల, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : గృహజ్యోతి సర్వే చేస్తున్న సిబ్బంది

గృహజ్యోతి సర్వే

ఆత్మకూరు : మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ సిబ్బంది చేపట్టిన గృహజ్యోతి సర్వే గురువారం కొనసాగింది. ఆధార్, రేషన్‌కార్డు నంబర్లను విద్యుత్‌శాఖ సిబ్బంది అప్‌డేట్ చేశారు. ఈ సందర్భంగా ఏఈ రవికుమార్ మాట్లాడుతూ.. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవి, రాజేందర్, రాజు, లక్ష్మణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాన్ని కూల్చొద్దు



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో గల గాంధీనగర్ చౌరస్తా వద్ద నిర్మించిన వినాయక మండపాన్ని కూల్చొద్దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. నారాయణగిరి గ్రామస్తులు బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. ముందుగా గ్రామంలో రోడ్లపై ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. గాంధీ చౌరస్తా నుంచి గ్రామపంచాయతీ వరకు వెళ్లే సీసీరోడ్డుపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించేందుకు కృషి చేయాలని అన్నారు. వినాయక మండపాన్ని కూల్చే ఆలోచన మానుకోవాలని అన్నారు. వినతిపత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారికి పంపించి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్త మండలి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లింగయ్య

ఐనవోలు : ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి 58 జీఓ ప్రకారం పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ విక్రమ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులను గుర్తించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, ప్రభుత్వం దృష్టి సారించి హద్దులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల నాయకులు గబ్బెట రాంకుమార్, రాయపురం కొమురయ్య, బొమ్మకంటి యాకయ్య, మల్లయ్య, పోచమ్మ, సృజన, సరోజన, బుచ్చమ్మ, రాజమణి పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ఐనవోలు : సీపీఎం వామపక్షాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పూనుకుందని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య మండిపడ్డారు. విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం విద్వేషపూరిత వైఖరిని అనుసరించడం సరికాదని హితవు పలికారు. ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తున్న రాష్ట్రంపై జోక్యం చేసుకుని గవర్నర్లను ప్రోత్సహిస్తూ రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం ఇవ్వాల్సిన అన్ని రకాల నిధులను సకాలంలో విడుదల చేసి సహకరించాలని కోరారు. రాంకుమార్, పోచమ్మ, సృజన, రాజమణి, కొమురయ్య, యాకయ్య, పద్మ, బుచ్చమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



శాయంపేట : విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్సై దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు లాంగ్ జంప్, హైజంప్ ప్రాక్టీస్ కోసం ఎస్సై తన సొంత ఖర్చుతో ఇసుకను పోయించి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి మైదానంలో లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షల సమయం సమీపిస్తున్నందున ఒత్తిడికి లోనవ్వకుండా స్వేచ్ఛగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతే రాజ్‌కుమార్, పీఈటీ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కటుంబానికి ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న స్నేహితులు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బైరి అయిలమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న అయిలమ్మ కుమారుడు శ్రీనివాస్ ఎసెస్సీ బ్యాచ్ స్నేహితులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయిలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ. 33 వేల ఆర్థికసాయం అందజేశారు. ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు నారాయణ, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌రెడ్డి, సతీష్, పెద్దిరెడ్డి, రమేష్, మోహిన్ బాష, తిరుపతి, రమేష్, వేణు, శ్రీనివాస్, రాజయ్య, వెంకన్న, అశోక్, రాజయ్య, శ్రీనివాస్‌రావు, కుమార్ ఉన్నారు.

వరిసాగులో మెళకువలు పాటించాలి



వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ

ధర్మసాగర్ : వరిపంట సాగు చేసే రైతులు మెళకువలు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఓ పద్మ సూచించారు. మండలంలోని దేవునూర్, ధర్మసాగర్ గ్రామాల్లోని పంట పొలాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరిలో జింక్ లోపం, వేరుకుళ్లు, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించామని అన్నారు. దీని నివారణకు రైతులు ఇదివరకు నారుమడిలో గుళికలు వేయపక్షంలో 15 రోజుల వయస్సు గల పిలకదశలో ఉన్న ఎకరం వరిలో 8కేజీల కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు లేదా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు, 4కేజీల క్లోరాంట్రినిలిప్రోల్ 0.4జీ గుళికలను సుమారు 20, 25 కేజీల ఇసుకలో కలిపి బురద పదనులో వేయాలని సూచించారు. అదే విధంగా ఎకరా వరికి కొరాజిన్ 60ఎంఎల్ పిచికారి చేయాలని అన్నారు. చిరుపొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతి గమనించినట్లైతే కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ (50 శాతం) ఎస్‌పీ 2 గ్రాములు లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 ఎంఎల్, లేదా ఐసోసైక్లోసిరమ్ 0.6 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. జింక్ లోపం ఉన్న పొలాల్లో చీలేటెడ్ జింక్ 100 గ్రాములు 150–200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. వేరుకుళ్లు ఎక్కువగా ఉన్న వరిలో రైతులు నీటిని ఎప్పటికప్పుడు పొలం నుంచి బయటికి తీసి మళ్లీ నీటిని పడుతూ ఉండాలన్నారు. అలాగే హెక్సాకొనజోల్ 2ఎంఎల్ లీటర్ నీటికి లేదా ప్రొపికొనజోల్ 1 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

రక్తదానం చేసేవారు ప్రాణదాతలు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్టీఓ రంగారావు

ఖిలా వరంగల్: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించినట్లవుతుందని వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆర్టీఓ రంగారావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ – ఖమ్మం రోడ్డులోని వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఎంవీఐ రమేష్‌రాథోడ్, రవీందర్ అధ్యక్షతన గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా నష్టం కలుగుతుందనే అపోహను విడనాడాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ బ్లెడ్ బ్యాంక్ సెంటర్ వైద్యులు 56 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఈవీ శ్రీనివాస్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వరూప్‌రెడ్డి, వాహనదారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వేలేరు : రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మల్లికుదుర్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రిషి, వరుణ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం జయసాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 9,10,11 తేదీల్లో ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఈటీ సుమలత అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

పరకాల : ఈనెల 16వ తేదీన పట్టణంలోని స్వర్ణ గార్డెన్‌లో నిర్వహించతలపెట్టిన దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ కౌన్సిలర్ బొచ్చు దిలీప్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అమరధామంలో దళితుల ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొచ్చు దిలీప్ మాట్లాడుతూ.. 9 సంవత్సరాల బీఆర్‌ఎస్ పరిపాలనలో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని చూస్తుందని, కానీ బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. అలాంటి కుట్రలను తిప్పి కొట్టేందుకు పట్టణంలోని స్వర్ణ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేయనున్న ఆత్మీయ సమ్మేళనానికి దళితులు, సామాజిక మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ఉద్యమకారులు బొచ్చు చిన్ని, సురేష్, శంకర్, సదయ్య, యువరాజ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

28న ఏఐవైఎఫ్ రాష్ట్ర సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్ / న్యూశాయంపేట: వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల జయసేన ఆడిటోరియంలో ఈనెల 28న యువత కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన సమావేశంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యువజన, విద్యార్థి, మేధావి వర్గ బాధ్యులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. దేశంలో యువత ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186కోట్ల మంది యువజనులు ఉంటే అందులో 28శాతం భారతీయులేనని వివరించారు. దేశంలో 30శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని విమర్శించారు. దేశ పాలకుల విధానాలు – నేటి యువత కర్తవ్యం అనే అంశంపై ఈనెల 28న నిర్వహించనున్న యువజన రాష్ట్ర సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మస్కక సుధీర్, భాస్కర్, ఫయాజ్, జగదీష్, సుమన్, రామన్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరూప్‌నగర్ – మడిపల్లికి బస్సు నడపాలి

హన్మకొండ : హనుమకొండ నుంచి నిరూప్‌నగర్ మీదుగా మడిపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని నిరూప్‌నగర్ వాసులు కోరారు. కాంగ్రెస్ నాయకుడు భీమానాయక్ ఆధ్వర్యంలో ఆర్టీసీ హనుమకొండ డిపోలో డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మడిపల్లి, నిరూప్‌నగర్, ఆర్టీసీ కాలనీ, సప్తగిరి కాలనీలకు చెందిన విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చదువుకోవడానికి ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. అలాగే, వివిధ పనుల నిమిత్తం ఆయా కాలనీల వాసులు కూడా హనుమకొండకు వచ్చి వెళ్తుంటారని చెప్పారు. ఈక్రమంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్, నిరూప్‌నగర్ మీదుగా మడిపల్లి వరకు బస్సు నడపాలని కోరారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



ఎల్కతుర్తి : పారిశుద్ధ్య పనులు చేపట్టిన సిబ్బంది



భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో..

ఎల్కతుర్తి : గ్రామాల్లో చేపట్టిన స్పెషల్‌డ్రైవ్ పారిశుద్ధ్యం పనులు రెండోరోజు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, ఎల్కతుర్తి మండల కేంద్రంలో గురువారం ముమ్మరంగా కొనసాగాయి. ఈనెల 7నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో చెత్తాచెదారం తొలగించడంతో పాటు రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీలను జీపీ సిబ్బంది శుభ్రం చేశారు. వైకుంఠధామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఎంపీడీఓలు సునీత, భాస్కర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ పరిధిలో పటిష్ట నిఘా



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: స్టేషన్ పరిధిలో పగలు, రాత్రి పూర్తి స్థాయిలో నిఘా పెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. అపరిచితుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గురువారం సాయంత్రం పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్లు ఆటోల్లో సంచరించారన్న వార్త కలకలం రేపింది. దాంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య.. హుటాహుటిన ఉర్సు కరీమాబాద్ స్కూల్ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమానితులు ఎవరూ సంచరించలేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, వెంకన్న, మున్నీరుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య గురువారం సాయంత్రం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు కుటుంబంతో కలిసి ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. అల్లర్లు, గొడవలు, భూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ తరచూ లీకేజీ అవడంతో సంబంధిత శాఖ అధికారులు పైపులైన్ పనులను చేపట్టగా నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేస్తూ నెట్టుకొస్తున్నారు. పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.